
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
గురువారం 15 ఫిబ్రవరి 2024





విశేష అలంకరణలో కొలనుభారతి అమ్మవారు



భక్తులకు అన్నసమర్పణ



అమ్మవారి క్షేత్రంలో సామూహిక అక్షరాభ్యాసం

వైభవంగా వసంత పంచమి

- కొలను భారతి క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు
- శ్రీశైలం దేవస్థానం నుంచి అమ్మవారికి పట్టువస్త్రాలు
- చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించిన తల్లిదండ్రులు



అమ్మవారిని దర్శించుకుంటున్నపీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి స్వామీజీ



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న శ్రీశైలం ఆలయ అధికారులు



క్యూలైన్లలో భక్తులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 14: కొలనుభారతి పుణ్యక్షేత్రంలో జ్ఞానసరస్వతి అమ్మవారి జన్మదినం పురస్కరించుకుని బుధవారం వసంత పంచమి వేడుకలు వైభవంగా జరిగాయి. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ ప్రాంతం నుంచి కూడా భక్తులు అధికంగా తరలి వచ్చారు. దీంతో క్షేత్ర ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. బుధవారం తెల్లవారు జామునే అమ్మవారికి శ్రీశైలం దేవస్థానం నుంచి అక్కడి ఆలయ సూపరింటెండెంట్ స్వాములు, పురోహితులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ముందుగా వారికి ఈవో మోహన్, ఆలయ పాలక మండలి చైర్మన్ వెంకటనాయుడు, పురోహితులు పూర్ణకుంభం స్వాగతం పలికారు. అలాగే కాకనూరు శారదా మఠం పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి స్వామీజీ కూడా అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అలాగే ప్రాతఃకాల సమయంలోనే ముందుగా అమ్మవారికి చారుగోశిని నది జలాలతో అభిషేకం చేశారు. అనంతరం ఏకవర రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన తదితర విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అమ్మవారిని అలంకరించారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

అమ్మవారిని దర్శించుకున్న వారిలో నందికొట్కూరు వైసీపీ ఇన్‌చార్జి ధారా సుధీర్, టీడీపీ అధికార ప్రతినిధి కాకరవాడ చిన్న వెంకటస్వామి, నాయకులు చెరుకుచర్ల రఘురామయ్య, మహేష్ నాయుడు, ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు నాగభూషణ్, లక్ష్మీనారాయణ, రేంజ్ అధికారి పట్టాభి, తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీడీవో జవహర్‌రావు, ఎంపీపీ కుసుమలత, జడ్పీటీసీ సోముల సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



కొలనుభారతి క్షేత్రం పరిసరాల్లో భక్తుల సందడి



అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

కొలను భారతిలోని సరస్వతి అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ముఖ మండపంలో పురోహితుల ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం చేయించుకున్నారు. దీంతో 618 మంది చిన్నారులకు అక్షరాభ్యాస క్రతువులు చేయించుకోవడం తో క్షేత్రానికి రూ.1,85,700 ఆదాయం లభించింది. అలాగే దర్శనం టికెట్ల ద్వారా రూ.7,600 ఆదాయం వచ్చినట్లు ఈవో మోహన్ తెలిపారు. ఇదిలా ఉంటే శివపురం గూడెం వద్దనే భక్తుల వాహనాలను నిలిపివేసి అక్కడి నుంచి క్షేత్రం వరకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు నడపడం వల్ల ఈ ఏడాది ట్రాఫిక్ జామ్ కాకుండా ఆత్మకూరు పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. రద్దీ కారణంగా క్యూలైన్‌లలో బారులు తీరిన భక్తులు కొంత ఇబ్బందులు పడ్డారు. అక్షరాభ్యాసం చేయించుకునేందుకు కూడా గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ముగిసిన కుంభాభిషేకం



అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు

నందవరం చౌడేశ్వరీ ఆలయానికి పోటెత్తిన భక్తులు



చౌడేశ్వరీ అమ్మవారు

బనగానపల్లె, ఫిబ్రవరి 14: కోరిన కోర్కెలు తీర్చే దైవంగా విరాజిల్లుతున్న నందవరం చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం కుంభాభిషేకం వేడుకలు ఘనంగా ముగిశాయి. నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న చౌడేశ్వరీమాత విగ్రహ ప్రాణప్రతిష్ఠ, కుంభాభిషేకం కార్యక్రమాల్లో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ రామానుజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వస్తి వాచనం, దీక్షా హోమాలు, ప్రాణ ప్రతిష్ఠ చండీ హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు సంప్రదాయ రీతిలో జరిగాయి. భక్తులు చౌడేశ్వరీ మాతకు అమ్మవారికి చీరె, సారెలు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ అధికారులు, దాతలు అన్న సమర్పణ చేశారు. సాయంత్రం చౌడేశ్వరీమాత గ్రామోత్సవం కన్నులపండువగా సాగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు, నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందారెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లను పరిష్కరించాలి

ఏపీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి రెడ్డి



వినతి పత్రం ఇస్తున్న ఏపీజేఏసీ నాయకులు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 14: ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఏపీ జేఏసీ నాయకుడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరిరెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ ర్యాలీగా కలెక్టరేట్ ఆవరణలోకి వెళ్లారు. ఏపీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంగళరెడ్డి, తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు మణిశేఖర్, హుసేన్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ శ్రీనివాసులుకు అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి రూ.2 లక్షల నుంచి 4 లక్షల వరకు బకాయిలు చెల్లించాలన్నారు. ఉద్యోగులు ప్రభుత్వంలో ఒక భాగమేనన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, జీవో.నెం.117ను రద్దు చేయాలన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ఫుల్‌టైం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీసు రూల్స్ అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో 13 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల అపరిష్కృత డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్ర ఏపీ జేఏసీ విజయవాడ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ ప్రకటించినట్లు వారు తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం గురువారం నుంచి నిరసన కార్యక్రమాలు, 27 చలో విజయవాడ చేపట్టనున్నట్లు తెలిపారు.

సంజీవయ్య సేవలు ఎనలేనివి : కలెక్టర్



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 14: ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య చేసిన ఎనలేనివని కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో దామోదరం సంజీవయ్య 103 జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా కలెక్టర్ కె.శ్రీనివాసులు జ్యోతి వెలిగించి సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఏపీ ఎస్సీడీసీయల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, డీఆర్వో పద్మజ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చింతామణి, దళిత సంఘం నాయకులు దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య కర్నూలు జిల్లా కల్లూరు మండలంలోని పెద్దపాడు గ్రామంలో 1921 ఫిబ్రవరి 14వతేదీన దళిత కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగి ఉన్నత పదవులు అలంకరించి దేశానికి ఎనలేని సేవ అందించారన్నారు. వెనుకబడిన వర్గాలకు ఎంతో సేవ చేశారని, ప్రతి ఒక్కరూ ఆయన బాటలో నడవాలని అన్నారు. అనంతరం దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కొమ్ముపాలెం శ్రీనివాస్ దామోదరం సంజీవయ్య జీవిత చరిత్ర దేశానికి అందించిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు, జిల్లా విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమయం లేదు..!

- గ్రూప్-2 పరీక్ష గడువు పెంచాలి
- ఇంత తక్కువ కాలంలో ప్రిపేర్ అయ్యేదెలా?
- ఆందోళనలో అభ్యర్థులు

నంద్యాల, ఆంధ్రజ్యోతి:

'అధికారంలోకి వచ్చాక 2.30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తాం. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం.' అంటూ అప్పటి ప్రతి పక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగులకు ఆశ చూపి ఓట్లు వేయించుకున్నారు. అధికారం చేపట్టి సీఎం అయిన తర్వాత నిరుద్యోగులను పట్టించుకున్న పాపాన పోలేదు. నాలుగున్నరేళ్లు మొద్దు నిద్రపోయి తీరా ఎన్నికల ముంగిట ఉద్యోగాల భర్తీ అంటూ గ్రూప్ -2 నోటిఫికేషన్ ఇచ్చారు. దరఖాస్తు తేదీకి, ప్రిలిమ్స్ పరీక్షకు 75 రోజుల సమయం మాత్రమే ఇచ్చారు. ఈ కొద్ది సమయంలో తాము ఎలా పరీక్షకు సిద్ధమవుతామని, గడువు పెంచాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.



పక్క రాష్ట్రంలో అలా..

సరిగ్గా ఎన్నికలకు నాలుగు నెలల ముందు గ్రూప్-2 నోటిఫికేషన్, రెండు నెలల ముందు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఉద్యోగార్థులు తీవ్ర ఆందోళనకు లోనవుతున్నారు. గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్ష ఫిబ్రవరి 25న ఉండగా, డీఎస్సీ పరీక్ష మార్చి 15 నుంచి 30 వరకు జరగనుంది. ఉద్యోగార్థుల్లో ఎక్కువ శాతం మంది అటు గ్రూప్-2, ఇటు డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్న వారు ఎక్కువ మందే ఉన్నారు. ఈ పరీక్షల మధ్య ఎక్కువ సమయం లేకపోవడంతో అభ్యర్థులు పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యే పరిస్థితి లేదు.

సబ్జెక్టులు పెంచి..

గ్రూప్-2 పరీక్షల సిలబస్‌ను జూలైలో విడుదల చేసింది. అప్పటి వరకు మూడుగా ఉన్న సబ్జెక్టులను ఐదుకు పెంచేసింది. గతంలో కరెంటు ఎఫైర్స్, పాలిటీ, ఎకానమీగా ఉన్న సబ్జెక్టులను మార్చివేసి, కొత్తగా మెంటల్ ఎబిలిటీ, ఇండియన్ సొసైటీ, హిస్టరీ, జాగ్రఫి, కరెంటు ఎఫైర్స్ సబ్జెక్టులను ప్రవేశపెట్టింది. ఈ సబ్జెక్టుల్లో ఇండియన్ సొసైటీ పూర్తిగా కొత్త సబ్జెక్టు కాగా, జాగ్రఫీలో వరల్డ్ జాగ్రఫీని కూడా కలిపింది.

ఎక్స్ (ట్విట్టర్)లో రోజూ వందలాది మెసేజ్‌లు..



'గ్రూప్-2 పరీక్ష విషయంలో అభ్యర్థుల అభ్యంతరాలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, తమ గోడును మీరైనా పట్టించుకుని గ్రూప్-2 పరీక్ష వాయిదా వేయాలి' అంటూ ఏపీపీఎస్సీ సభ్యుడు పరిగే సుధీర్ ఎక్స్ (గతంలో ట్విట్టర్) ఖాతాకు రోజూ వందలాది మెసేజ్‌లు ఉద్యోగార్థుల నుంచి వెళ్తున్నాయి. ప్రభుత్వ విధానం వల్ల తమ భవిష్యత్తు నాశనమయ్యే ప్రమాదం ఉందని కొంతమంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిరుద్యోగులను మభ్యపెట్టేందుకు..

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఏటా లక్షల సంఖ్యలో విద్యార్థులు డిగ్రీ పట్టాలు పుచ్చుకుని కళాశాల బయటకు వస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5 లక్షల మంది గ్రూప్- 2 ఆశావహులు ఉన్నారు. వీరంతా సొంత వారికి, ఉన్న ఊరికి దూరంగా కోచింగ్ సెంటర్లలో మగ్గిపోతున్నారు. వీరందరిని నాలుగేళ్లుగా వైసీపీ ప్రభుత్వం ఉద్యోగాల పేరుతో మభ్యపెడుతూ వచ్చింది. ఎట్టకేలకు గతేడాది డిసెంబరులో 897 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇక దరఖాస్తు చేసుకోవడానికి, ప్రిలిమ్స్ పరీక్షకు హాజరయ్యేందుకు నిర్దేశించిన వ్యవధి మాత్రం చాలా తక్కువగా ఇచ్చారు. నోటిఫికేషన్ విధానం, విడుదల చేసిన పోస్టులను చూసిన గ్రూప్-2 ఆశావహులు వైసీపీ ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో..

గత ప్రభుత్వ హయాంలో రెండు సార్లు గ్రూప్-2 పరీక్ష నిర్వహించారు. మొదటిసారి 2016లో నవంబరు 11న నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రిలిమ్స్ పరీక్షను 2017 ఫిబ్రవరి 26న నిర్వహించింది. దరఖాస్తులు, పరీక్షకు మధ్య 108 రోజుల వ్యవధి ఉండింది. ఇక రెండోసారి 2018 డిసెంబరు 31న విడుదల చేసింది. ఆ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఆ పరీక్ష 2019 మే 5న జరిగింది. నోటిఫికేషన్‌కు, పరీక్షకు మధ్య 126 రోజులు వ్యవధి ఉండింది. దీంతో గ్రూప్-2 పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సన్నద్ధమయేందుకు తగినంత సమయం ఏర్పడింది.

చెల్లికి, తల్లికి న్యాయం చేయలేని
జగన్ ప్రజలకేం చేస్తాడు

నంద్యాల పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి

కొత్తపల్లి, ఫిబ్రవరి 14: సొంత చెల్లికి, తల్లికి న్యాయం చేయలేని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఏం న్యాయం చేస్తాడని నంద్యాల పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం కొత్తపల్లిలోని రాజరాజేశ్వరి పాఠశాల ఆవరణలో వడ్డెర సంఘం నాయకులు తిరుపాల్‌బాబు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామి గౌడుల అధ్యక్షతన జయహో బీసీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మాండ్ర మాట్లాడుతూ పేదలు, పెత్తందారులకు జరుగుతున్న యుద్ధం అని పదే పదే చెబుతున్న సీఎం జగన్ దేశంలోనే అత్యంత సంపన్నుడని అన్నారు. ఇలాంటి వ్యక్తులు దోచుకుని, దాచుకుని రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని అన్నారు. 20 మందికి పైగా ఎంపీలను గెలిపిస్తే.. ప్రధాని మోదీ మెడలు వంచి రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తానని చెప్పి నేడు మోదీ కాళ్ల పట్టుకుంటున్నాడని దుయ్యబట్టారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో 73 మంది బీసీలను హత మార్చిన ఘనత జగన్‌దేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య, టీడీపీ మండల కన్వీనర్ నారపురెడ్డి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, జడ్.వెంకటరెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, శివారెడ్డి, నాగేశ్వరరావు యాదవ్, సీలం లింగన్న, జానకి రాముడు, ప్రసాద్ రెడ్డి, రమణారెడ్డి, గిరీశ్వరరెడ్డి, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు యాదవ్, జహరుల్లా, మాదుగుల శేఖర్, వాల్మీకి, బెస్త, కురువ సంఘాల నాయకులు గోవిందనాయుడు, వెంకటేశ్, మహానంది పాల్గొన్నారు.

ఎడారిలా తుంగభద్ర



తుంగభద్ర నదిలో నీరు లేక నెర్రలిచ్చిన భూమి

నీరు లేక ఎండిపోయిన వరి పైర్లు

కోసిగి, ఫిబ్రవరి 12: గత 20 ఏళ్లలో ఎన్నడూ తుంగభద్ర నదిలో నీరు ఇంకిపోలేదు. ఎప్పుడూ నీటితో కళకళలాడే తుంగభద్ర ఈసారి మాత్రం ఎడారిగా మారింది. తుంగభద్ర నదిని నమ్ముకున్న సాతనూరు, తుమ్మిగనూరు, కందుకూరు, కడిదొడ్డి, అగసనూరు తదితర గ్రామాల రైతులు ఎప్పటిలాగే వరి నాట్లు వేసుకున్నారు. అయితే.. నీరు లేకపోవడంతో వేసిన పంటలు కళ్ల ముందే ఎండిపోతున్నాయి. డిసెంబరులోనే నదిలో నీరు లేక ఎండిపోవడంతో పొలాల్లో వేసిన వరి పైర్లు ఎండిపోయాయి. పచ్చగా కనిపించే నదీతీర పొలాలు నేడు కళావిహీనంగా కనిపిస్తున్నాయి. దీంతో నదీతీర ప్రాంతాల రైతులు ఇతర ప్రాంతాలకు వలసబాట పట్టారు.



గడ్డి పెరిగిన తుంగభద్ర నది



రాళ్లగుట్టలతో దర్శనమిస్తున్న తుంగభద్ర నది

సహకార బ్యాంకును ప్రగతిపథంలో నడిపిద్దాం

- త్వరలో కంప్యూటీకరణ పూర్తి
- కేడీసీసీ బ్యాంకు సీఈవోగా బాధ్యతలు చేపట్టిన శివలీల



కేడీసీసీ బ్యాంకు ఛైర్‌పర్సన్ విజయ మనోహరిని కలిసిన సీఈవో శివలీల

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 14: కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వ సహకారంతో అన్ని విధాలా ముందుకు వెళతామని, సహకార బ్యాంకును పాలక మండలి సహకారంతో ప్రగతిపథంలో నడిపిస్తామని ఉమ్మడి కర్నూలు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో శివలీల తెలిపారు. బుధవారం బ్యాంకు ఛైర్‌పర్సన్ విజయమనోహరిని కలిసి బ్యాంకు అభివృద్ధిపై వివిధ కార్యక్రమాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకుల కంటే మిన్నగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా రైతులకు ప్రభుత్వం ఎక్కువ ప్రయోజనం చేకూర్చేందుకు కృషి చేస్తున్నదని సీఈవో శివలీల తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ సక్రమంగా, వేగంగా జరుగుతోందని అన్నారు. ఈ కంప్యూటరీకరణ పూర్తయితే.. రైతులకు అన్ని కార్యక్రమాలు పారదర్శకంగా, వేగవంతంగా అమలు చేసేందుకు సాధ్యపడుతుందన్నారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని సహకార శాఖ, జిల్లా సహకార బ్యాంకు పర్యవేక్షణలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రస్తుతం డేటా ఎంట్రీ వేగంగా జరుగుతున్నదన్నారు. ఈ విషయంలో ప్రతిరోజు ప్రిన్సిపల్ సెక్రటరీ రివ్యూ చేస్తున్నారని, ప్రతి సహకార సంఘం ఛైర్మన్ ఈ కంప్యూటీకరణకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం వల్ల రైతుల ఆర్థిక లావాదేవీల నిర్వహణ సక్రమంగా జరుగుతుందని తెలిపారు.

ధర్మకర్తల నియామకానికి దరఖాస్తులు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 14: జిల్లాలోని ఆలయాలకు ధర్మకర్తలను నియమించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. దిన్నెదేవరపాడు రూపాల సంగమేశ్వరస్వామి, ఆదోని మండలం కోట వీరభద్ర స్వామి దేవస్థానం, వెంగళాపురం ఆంజనేయస్వామి దేవస్థానం, అంబా భవాని దేవస్థానం, కౌతాళం మండలం ఉప్పరహాల్ గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవస్థానాలకు నూతన ధర్మకర్తల మండలికి ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు హిందూ మతస్తులై ఉండాలని, ఇందులో మొత్తం ఏడుగురు ధర్మకర్తల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ధర్మకర్తల మండలిలో ఎస్సీ మహిళ ఒకరు, బీసీ మహిళ ఒకరు, ఎస్టీ మహిళ ఒకరు, ఓసీ మహిళ ఒకరు, నాయి బ్రాహ్మణ పురుషుడు అభ్యర్థి ఒకరు తప్పని సరిగా ఉంటారని ఇద్దరు ఓసీ పురుష అభ్యర్థులు ఉంటారని తెలిపారు. దరఖాస్తులు మార్చి 1వ తేదీలోపు కర్నూలు నగరంలోని మద్దూరు నగర్ అసిస్టెంట్ కమిషనర్ దేవదాయ శాఖ కార్యాలయానికి చేరుకోవాలని తెలిపారు.

పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాలకు రూ.4.11 కోట్లు

జేడీ రామచంద్రయ్య

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 14: ప్యాపిలి మండలం కొమ్మెమర్రి వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. ఈమేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది జీవో.నెం.40ని విడుదల చేశారు. కళాశాల నిర్మాణం, ఇతర వసతుల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.4.11 కోట్లను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని పశుసంవర్ధక శాఖ జేడీ రామచంద్రయ్య తెలిపారు.

సంజీవయ్య సేవలు మరువలేం

కలెక్టర్ డాక్టర్ జి.సృజన



దామోదరం సంజీవయ్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 14: దామోదరం సంజీవయ్య రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని కలెక్టర్ డా.జి. సృజన పేర్కొన్నారు. బుధవారం సంజీవయ్య 103వ జయంతి సందర్భంగా స్థానిక నంద్యాల చెక్ పోస్టు కూడలి వద్ద ఉన్న దామోదరం సంజీవయ్య విగ్రహానికి కలెక్టర్ డా.జి. సృజన, నగర మేయర్ బీవై రామయ్య, జిల్లా అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజానికి ఆశాజ్యోతి, స్ఫూర్తిప్రదాత అయిన దామోదరం సంజీవయ్య కర్నూలు జిల్లా, పెద్దపాడు గ్రామంలో 1921 సంవత్సరం ఫిబ్రవరి 14న జన్మించారన్నారు. నిరుపేద, దళిత కుటుంబంలో జన్మించిన ఆయన నిరాడంబరత, నిజాయితీ నేటి తరానికి ఆదర్శప్రాయమని అన్నారు. 1960 జనవరి 10న ఆంధ్ర రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య పని చేశారని అన్నారు. ఈ సమావేశంలో సీపీవో హిమప్రభాకర్ రాజు, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగలక్ష్మీదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.

త్వరలో భారత్ రైస్

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 14: భారత్ రైస్ పేరుతో నాణ్యమైన సన్న బియ్యం సబ్సిడీపై కిలో రూ.29 కు ఇస్తామని కర్నూలు జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ రాజు తెలిపారు. పది రోజుల కింద కేంద్ర ప్రభుత్వం భారత్ రైస్ గురించి ప్రకటించడంతో లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే దేశంలోని వివిధ రాష్ట్రాల్లో నాఫెడ్ తదితర కేంద్ర సంస్థల ద్వారా సన్న బియ్యాన్ని చౌక ధరకు అందిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా మార్క్‌ఫెడ్‌తో పాటు డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా ఈ బియ్యాన్ని అందించేందుకు త్వరలోనే చర్యలు తీసుకుంటామని జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ రాజు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కూడా చౌక ధరకు అందించేందుకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం గోధుమపిండి, శనగ పప్పును అందించే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.

చౌక ధరకు గోధుమ పిండి, శనగ పప్పు



చౌకధరకే అందిస్తున్న గోధుమపిండి, శనగ పప్పు ప్యాకెట్లు

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 14: కేంద్ర ప్రభుత్వ సంస్థ నాఫెడ్ ద్వారా తక్కువ ధరకే సన్నబియ్యంతో పాటు గోధుమ పిండి, శనగ పప్పును చౌకధరకు అందించేందుకు డీసీఎంఎస్ కేంద్రాలను ఎంపిక చేసింది. ఇందులో భాగంగా గోధుమ పిండి, శనగ పప్పులను డీసీఎంఎస్ కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు, ఆదోని బ్రాంచీల ద్వారా ప్రజలకు పంపిణీ చేస్తున్నట్లు డీసీఎంఎస్ సంస్థ బిజినెస్ మేనేజర్ రాజేష్ తెలిపారు. శనగ పప్పు కిలో ధర రూ. 60, గోధుమ పిండి కిలో రూ.27.50 ప్రకారం పంపిణీ చేస్తున్నామన్నారు. శనగ పప్పు కిలో ప్యాకెట్, గోధుమపిండి 5 కిలోలు, 10 కిలోల ప్యాకెట్లు అందుబాటులోకి తెస్తున్నారు. ఇప్పటి వరకు కర్నూలు మార్కెట్ యార్డు డీసీఎంఎస్ కేంద్రానికి 5 టన్నుల గోధుమపిండి, 10 టన్నుల శనగ పప్పు, ఆదోని డీసీఎంఎస్ కేంద్రానికి గోధుమ పిండి 20 టన్నులు, శనగ పప్పు 10 టన్నులు కేటాయించినట్లు తెలిపారు. డోన్, కోడుమూరు డీసీఎంఎస్ కేంద్రాల్లో కూడా పై సరుకులను అందిస్తామని తెలిపారు.

రహదారి భూ సేకరణ పరిహారం చెల్లించండి

నంద్యాల కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, రహదారుల భూసేకరణ అధికారులు తదితరులు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 14: జాతీయ రహదారులు 340సి, 340బి, 167కె లకు సంబంధించి భూ సేకరణ జరిగి అవార్డు ఎంక్వయిరీ పూర్తయిన వాటికి పరిహారం చెల్లించాలని కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో రహదారుల భూసేకరణ, పరిహారం చెల్లింపు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి(340సి) కర్నూలు నుండి దోర్నాల వరకు, జాతీయ రహదారి (167కె) నంద్యాల నుండి జమ్మలమడుగు వరకు, జాతీయ రహదారి (340బి) సోమయాజులపల్లె నుండి డోన్ వరకు భూసేకరణ పూర్తయి పెండింగ్‌లో వున్న పరిహారాన్ని వెంటనే చెల్లించాలని కార్యనిర్వహణాధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఎన్‌హెచ్‌ఐ ప్రాజెక్టు డెరెక్టర్ గోవర్ధన్ రెడ్డి, ఏపీఆర్డీసీ కార్యనిర్వహణాధికారి శంకర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్ అధికారి సుభోద్, ఎన్‌హెచ్‌ఐ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైల పాదయాత్రికుల ఏర్పాట్లపై పరిశీలన



సదుపాయాలను పరిశీలిస్తున్న దేవస్థానం అధికారులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 14: శ్రీశైల మహా క్షేత్రానికి కాలినడకన వచ్చే భక్తుల సదుపాయాలపై బుధవారం దేవస్థానం అధికారులు పలు అటవీ ప్రాంతాలను పరిశీలించారు. ప్రత్యేకించి ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని నాగలూటి, పెచ్చెర్వు ప్రాంతాలను దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మురళీధర్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పీవీ సుబ్బారెడ్డి, అసిస్టెంట్ ఇంజనీరు రంగప్రసాద్ పరిశీలించి భక్తులకు కల్పించాలని సౌకర్యాలపై చర్చించారు. మహాశివరాత్రి బ్రహోత్సవాలను పురస్కరించుకొని భక్తులు వెంకటాపురం, నాగలూటి, దామర్లకుంట, పెద్దచెరువు, మఠంబావి, భీమునికొలను, కైలాస ద్వారం మీదుగా శ్రీశైలానికి కాలినడకన చేరుకుంటారు. అయితే మార్గమధ్యలో పలు చోట్ల భక్తులకు తాగునీరు, వైద్యసేవలు, అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందులో భాగంగా అటవీ మార్గంలో జంగిల్ క్లియరెన్స్‌తోపాటు చలువ పందిళ్లు, తాగునీటి సదుపాయం, తాత్కాలిక విద్యుద్దీకరణ ఏర్పాటు చేపట్టనున్నారు. నాగలూటిలో తాగునీటిని అందించే పుష్కరిణిని శుభ్రపరచడంతోపాటు పెద్ద చెరువు, దామర్లకుంట ప్రాంతాల్లో చలువ పందిళ్లు, జనరేటర్లు, తాత్కాలిక శౌచాలయాలు ఏర్పాటు చేయనున్నారు. వీరి వెంట నాగలూటి రేంజ్ అధికారి దొరస్వామి, ఇతర అటవీ సిబ్బంది ఉన్నారు.

మహా కుంభాభిషేకానికి ఆహ్వానం



జవహర్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న అధికారులు

శ్రీశైలం, ఫిబ్రవరి 14: శ్రీశైలం మహా క్షేత్రంలో ఈ నెల 16 నుంచి 21 వరకు మహా కుంభాభిషేక మహోత్సవం జరగనుంది. ఈ ఉత్సవానికి పలువురు ప్రముఖులను బుధవారం ఆలయ అధికారులు ఆహ్వానించారు. ఇందులో భాగంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. జవహర్‌రెడ్డి, దేవదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్. కరికాల్ వళవన్, విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతిని మహాకుంభాభిషేక మహోత్సవానికి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ, ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు, ఏఈవో మోహన్ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ పోస్టుల మెరిట్ లిస్టు విడుదల

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 14: ఉమ్మడి జిల్లాలోని కర్నూలు, నంద్యాల, ఆదోని మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో 370 పోస్టులకు సంబంధించిన ప్రొవిజినల్ మెరిట్ లిస్టును విడుదల చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది నవంబరు 20న ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పోస్టులకు ఉమ్మడి జిల్లాకు చెందిన నిరుద్యోగులు 12,990 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న 26 కేటగిరీల అభ్యర్థుల ప్రొవిజినల్ మెరిట్ లిస్టు కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రభుత్వ వెబ్‌సైట్‌లలో అప్‌లోడ్ చేశారు. అభ్యర్థులు తమ మెరిట్‌లిస్టు వివరాలను సరి చూసుకుని అభ్యంతరాలు ఉంటే ఈ నెల 15వ తేదీ సాయంత్రం ఐదుగంటల్లోగా లిఖితపూర్వకంగా కర్నూలు మెడికల్ కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలియజేశారు. జనరల్ డ్యూటీ అటెండర్ ఆఫీసు సబార్డినేట్‌తో పాటు మరో రెండు పోస్టులకు త్వరలో ప్రొవిజినల్ మెరిట్ లిస్టును విడుదల చేస్తామని తెలిపారు.

జిల్లాకు రెండు పోలీస్ ఔట్ పోస్టులు

కర్నూలు, ఫిబ్రవరి 14: జిల్లాలో రెండు పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. జిల్లాలోని ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు వద్ద పోలీస్ ఔట్‌పోస్టు, మంత్రాలయం దేవస్థానం దగ్గర ఒక టూరిస్టు పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటుకు అనుమతులు ఇచ్చింది. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు వద్ద ప్రముఖుల భద్రత, ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు వద్ద పోలీస్ ఔట్‌పోస్టుకు, అలాగే మంత్రాలయం దేవస్థానం వచ్చే భక్తులు, పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అసౌకర్యం కలగకుండా టూరిస్టు పోలీస్ ఔట్‌పోస్టుకు అనుమతులు ఇచ్చింది. ఈ పోస్టులో భద్రత, రక్షణ పరంగా ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారిని స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా తగినంత పోలీసు సిబ్బందితో 24 గంటలపాటు అందుబాటులో ఉంటారని కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు తెలిపారు.

కొత్తగా 4 స్కానింగ్ కేంద్రాలకు అనుమతి

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 14: జిల్లాలో కొత్తగా 4 స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్‌కు జిల్లా మల్టీమెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ (పీసీపీఎన్‌డీటీ) ఆమోదం తెలిపింది. గురువారం మున్సుబ్ కోర్టు-7 అడిషినల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ న్యాయాధికారి చాంబరులో జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు అధ్యక్షతన పీసీపీఎన్‌డీటీ కమిటీ సమావేశమైంది. ఈ సమావేశానికి 7వ అడిషినల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ న్యాయాధికారి భూపాల్ రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య పాల్గొన్నారు. తనిఖీలు పూర్తి చేసి జిల్లా స్థాయి సలహా కమిటీ సిఫారసు చేసిన ఆరు రెన్యువల్స్, రెండు సవరణలకు సంబంధించిన దరఖాస్తులను కమిటీ ఆమోదించింది. ఆడపిల్లల సంరక్షణ కోసం ఎన్జీఓల సహకారంతో అవగాహన కల్పించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీఓ ప్రతినిధులు డాక్టర్ బాలమద్దయ్య, నోడల్ ఆఫీసర్ వై.ప్రవీణ్ కుమార్, డెమో ప్రమీలాదేవి, ప్రోగ్రాం కన్సల్టెంట్ సుమలత, ఎస్ఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

శ్రీశైలంలో చిరుత సంచారం



శ్రీశైలంలో సంచరిస్తున్న చిరుత

శ్రీశైలం, ఫిబ్రవరి 14: శ్రీశైల దేవస్థానం పరిధిలోని వాసవీ విహార్-2, రెడ్ల సత్రం సమీపంలో మంగళవారం అర్ధరాత్రి చిరుత సంచరించింది. గత కొంతకాలంగా రాత్రి వేళల్లో చిరుత సంచరిస్తోందని స్థానికులు తెలిపారు. చిరుత సంచారంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అటవీ అధికారులు స్పందించి చిరుత సంచార ప్రదేశాలలో బోను ఏర్పాటు చేసి చిరుతను బంధించి ఇతర ప్రదేశానికి తరలించాలని కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 14: మండలంలోని లొద్దిపల్లె గ్రామానికి చెందిన పోతురాజు దేవరాజు (44) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం దేవరాజు కర్నూలు నుంచి లొద్దిపల్లెకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. అదే గ్రామానికి చెందిన సతీష్ తన మోటారు సైకిల్‌తో అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ దేవరాజును కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ఆయన చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని తండ్రి కర్రెన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా దేవరాజుకు టీడీపీ నాయకుడు గౌరు వెంకటరెడ్డి తదితరులు నివాళులర్పించారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 14 : నంద్యాల మండలం పొన్నాపురం సమీపంలోని రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని బుధవారం స్థానికులు గుర్తించారు. రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడు తెల్లటి షర్టు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహమ్మద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

- నంద్యాల రైల్వేస్టేషన్‌లోని ప్రమాదవశాత్తు రైలు కిందపడి ఓ యువకుడు మృతి చెందినట్లు రైల్వే ఎస్సై జలీల్ తెలిపారు. గుడ్‌షెడ్ ప్రాంతానికి చెందిన రవికుమార్ నంద్యాల రైల్వేస్టేషన్‌లోని 1వ ప్లాట్‌ఫాం నుంచి 2వ ప్లాట్‌ఫాంకు వెళ్లేందుకు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన రైలు ఢీ కొనడంతో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

20న జడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 14: జిల్లా పరిషత్ సర్వసభ్యసమావేశం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశభవనంలో ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఇన్‌చార్జి మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డితో పాటు ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అధికారులు, శాసనసభ్యులు, ఎంపీలు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామీణ నీటి సరఫరా అండ్ పారిశుధ్య శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి జిల్లా పరిషత్ అండ్ మండల ప్రజా పరిషత్‌ల వార్షిక బడ్జెట్‌పై చర్చ ఉంటుందన్నారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాల జడ్పీటీసీలు, ఎంపీపీలు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

గార్లదిన్నెలో ఘర్షణ

ప్యాపిలి, ఫిబ్రవరి 14: మండలంలోని గార్లదిన్నె గ్రామంలో బుధవారం ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో నలుగురికి గాయాలయ్యాయి. గ్రామంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠ సందర్భంగా సీతారాముల ఉత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవంలో బండి చిన్నవీరయ్య, సుబ్బారెడ్డిలు ఘర్షణ పడ్డారు. విషయాన్ని తెలుసుకున్న సుబ్బారెడ్డి బంధువులు రాజశేఖర్‌రెడ్డి, ఏకాంతరెడ్డిలు చిన్న వీరయ్యపై దాడి చేశారు. ఈ దాడిలో వీరయ్యకు గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అలాగే ఘర్షణలో రాజశేఖర్‌రెడ్డికి కూడా గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు జలదుర్గం పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మంత్రాలయం, ఫిబ్రవరి 14: మంత్రాలయం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన ప్రసాద్ (44) అనే రైతు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఐదేళ్లుగా రైతు తనకున్న రెండెకరాల పొలంలో పత్తి, మిరప ఉల్లి వంటి పంటలు సాగు చేసేవాడు. వీటిపై తెచ్చిన అప్పులు పెరగడంతో వడ్డీలు ఎక్కువై తీర్చేదారి లేక మంగళవారం సాయంత్రం ఇంట్లో ఉన్న పురుగు మందు తాగాడు. ఎమ్మిగనూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతునికి దాదాపు రూ.8 లక్షల మేర అప్పు ఉంది. మృతుని భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మాధవరం ఏఎస్ఐ బందెనవాజ్ తెలిపారు. ఎమ్మిగనూరు ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతునికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

చంద్రబాబును కలిసిన మాండ్ర



నారా చంద్రబాబును కలిసిన మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు ఫిబ్రవరి 14: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి విజయవాడలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా నంద్యాల పార్లమెంట్‌లో టీడీపీలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై చంద్రబాబుతో చర్చించారు. మాండ్ర మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీదే అధికారమని, దీంతో చాలామంది నాయకులు పార్టీలో చేరుతున్నారని అన్నారు. వారందరూ పార్టీలో కార్యకర్తల్లా పని చేయాలని పిలుపునిచ్చారు.

'రేపటి బంద్‌ను విజయవంతం చేయాలి'

నందికొట్కూరు, ఫిబ్రవరి 14: గ్రామీణ భారత్ బంద్- పారిశ్రామిక సమ్మె శుక్రవారం జరుగుతుందని, విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో కరపత్రాలను పంపిణీ చేశారు. కేంద్రంలో బీజేపీ అవలంబిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా కేంద్ర కార్మిక సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయని తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రఘురామమూర్తి, సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐటీయూసీ నాయకులు నాగేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ నాయకులు దినేష్ పాల్గొన్నారు.

● దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నందికొట్కూరు పట్టణంలోని పగిడ్యాల రోడ్డులో కరపత్రాలను విడుదల చేశారు. రైతు సంఘం నాయకులు నాగరాజు, సుధాకర్, మౌలాలి బీ, ఉసేంద్ర, దాదాబాషా, పాండురంగడు పాల్గొన్నారు.

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16వ తేదీన దేశవ్యాప్తంగా చేపట్టనున్న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పదేళ్ల బీజేపీ పాలనతో దేశంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. నాయకులు చాంద్‌బాషా, బీసన్న, లల్లు, మహిళా సమాఖ్య నాయకురాలు స్వాతి, ముర్తుజా తదితరులు ఉన్నారు.

'డిమాండ్లు నెరవేర్చాలి'



ఆత్మకూరులో నిరసన వ్యక్తం చేస్తున్న జేఏసీ నాయకులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 14: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల డిమాండ్లను నెరవేర్చాలని ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్ సి.మోహన్‌రెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు శంకర్, ఏపీ ఎన్జీవోస్ తాలుకా కార్యదర్శి సాజిద్‌బాషా, విశ్రాంత ఉద్యోగుల సంఘం తాలుకా అధ్యక్షులు అచ్చయ్య అన్నారు. డిమాండ్ల సాధన కోసం ఉద్యమ కార్యాచరణలో భాగంగా బుధవారం ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆయా సంఘాల ఉద్యోగులు, పెన్షనర్లు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

'ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి'



మాట్లాడుతున్న ముస్లిం సంఘాల నాయకులు

నంద్యాల (టౌన్/నూనెపల్లె), ఫిబ్రవరి 14: రాష్ట్రంలో ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ముస్లిం సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నంద్యాలలోని కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీ ముస్లిం ఫెడరేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి మహబూబ్‌బాషా, యువజన విభాగం రాష్ట్ర కన్వీనర్ సుహెల్‌రాణా, ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ముల్లా ఖాజాహుసేన్ మాట్లాడారు. వైసీపీలోని ముస్లిం మైనార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సలహాదారులు జగన్‌ను ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో చదువుకున్న 35 లక్షలకు పైగా ఉన్న నిరుద్యోగులు జగన్‌కు తగిన బుద్ధి చెప్పబోతున్నారన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 30 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన జగన్ 6 వేల పోస్టుల భర్తీకి మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేయడం దారుణమని అన్నారు.

రేపు రథ సప్తమి

నందికొట్కూరు, ఫిబ్రవరి 14: నవనందుల కోటగా పిలువబడే నందికొట్కూరులోని అతి పురాతనమైన ఛాయా ఉషా సమేత సూర్యనారాయణస్వామి దేవాలయం ఎంతో ప్రసిద్ధి. ఏపీ రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి ఆరోగ్య ప్రదాత, ప్రత్యక్ష దైవం అయిన సూర్యనారాయణుడిని దర్శించుకునేందుకు వస్తుంటారు. ఆదిత్యుని జన్మదినం రోజున మాత్రమే మూల విరాటు పాదాలకు సూర్య కిరణాలు తాకుతాయి. ఈనెల 16వ తేదీన రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ రోజున దర్శనం చేసుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు అందుకు సంబంధించిన ఏర్పాట్లు ఆలయ కమిటీ సిద్ధం చేసింది.

వైభవంగా వసంత పంచమి

సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ● చిన్నారులకు అక్షరాభ్యాసం ● అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



మహానందిలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న వేదపండితులు



నంద్యాల గాయత్రీమాత ఆలయంలో పెన్నులతో సరస్వతీదేవి అలంకారం, జూపాడుబంగ్లా, ఆత్మకూరులో ప్రత్యేక అలంకారంలో అమ్మవారు



నంద్యాలలోని శ్రీకృష్ణమందిరంలో అక్షరాభ్యాసం

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 14: నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ కోదండ రామాలయం, గాయత్రీమాత ఆలయంలో వసంత పంచమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. బుధవారం సరస్వతీదేవి జన్మదినం సందర్భంగా బ్రహ్మనందీశ్వరాలయంలో ఈవో లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో, సంజీవనగర్ రామాలయంలో భగవత్ సేవాసమాజ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య ఆధ్వర్యంలో, గాయత్రీమాత ఆలయంలో బ్రహ్మణసేవాసమాఖ్య ఆధ్వర్యంలో సరస్వతీదేవికి ప్రత్యేక అలంకారం చేశారు. అమ్మవారికి క్షీరాభిషేకం, పంచామృత అభిషేకాలు, సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. సంజీవనగర్ కోదండ రామాలయంలో సరస్వతీదేవి విగ్రహానికి అష్టోత్తర క్షీరాభిషేకం, సరస్వతి మూలమంత్రం, కోలాటం నిర్వహించారు. గాయత్రీ మాత ఆలయంలో గాయత్రీ మాతకు పెన్నులతో అలంకరించారు. కార్యక్రమంలో బ్రహ్మణ సేవా సమాఖ్య అధ్యక్షుడు మురళీకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు. బాల అకాడమీలో కరస్పాండెంట్ రవీంద్రనాద్, ప్రిన్సిపాల్ మాధవీలత ఆధ్వర్యంలో సరస్వతీ లక్ష్మీగణపతి హోమం, అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు.

● నంద్యాల పట్టణంలో వెలసిన శ్రీకృష్ణమందిరంలో బుధవారం అర్చకులు సంగీతయ్య, నిర్వాహకులు విజయచంద్రుడు ఆధ్వర్యంలో అక్షరాభ్యాస కార్యక్రమం ఏర్పాటుచేశారు. జాయింట్ సబ్ రిజిస్ట్రార్ వనితాలక్ష్మి కుటుంబ సభ్యులు, చిన్నారులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

మహానంది: మహానంది క్షేత్రంలో బుధవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని సరస్వతీదేవి విగ్రహానికి వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాగశాల మంటపంలో చిన్నారుల చేత అక్షరాభ్యాసాన్ని తల్లితండ్రుల సమక్షంలో జరిపారు. జిల్లాల నలుమూలల నుంచి చిన్నారులతో తల్లితండ్రులు మహానందికి తరలివచ్చారు. ప్రధాన ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంత్‌శర్మ సమక్షంలో తమ చిన్నారులకు పలక చేత పట్టించి అక్షరాభ్యాసం జరిపారు.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లాలోని సరస్వతి ఆలయంలో బుధవారం వసంత పంచమి వేడుకలను నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యం పురోహితులు చేయించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణంలోని అంబాభవాని మాత ఆలయంలో వెలసిన జ్ఞాన సరస్వతి అమ్మవారి పుట్టినరోజును పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వసంత పంచమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా బుధవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో వెలసిన దేవతా మూర్తులకు, జ్ఞాన సరస్వతి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాది క్రతువులు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం ఆలయ పురోహితుల ఆధ్వర్యంలో కుంకుమార్చన, విద్యార్థులతో పుస్తక పూజ తదితర పూజలను నిర్వహించారు. ఆలయ కమిటి, భక్తుల ఆధ్వర్యంలో జ్ఞానసరస్వతి అమ్మవారికి రాత్రి తొట్లోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు నిర్వహించారు.

రేపు విభిన్న ప్రతిభావంతుల ఉద్యోగ మేళా

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 14: ఉమ్మడి కర్నూలు జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం నంద్యాలలో విభిన్న ప్రతిభావంతులకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పనాధికారి పి.దీప్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు మేళా ప్రారంభమవుతుందని చెప్పారు. వివిధ ప్రముఖ సంస్థల్లో ఎగ్జిక్యూటివ్, ఫోల్డింగ్ అసిస్టెంట్ పోస్టుల కోసం 19 -30 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి ఓహెచ్ (ఆర్థో) అయి ఉండాలని తెలిపారు. రూ.12,500 నుంచి రూ.14,000 వరకు జీతం ఉంటుందని తెలిపారు. పది, ఇంటర్ పాసైన విభిన్న ప్రతిభావంతులు విద్యార్హతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, ఫొటోలతో హాజరు కావాలని సూచించారు.

'భగవద్గీత ముక్తిదాయిని'

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 14: భగవద్గీతను పఠిస్తే సకల శోకముల నుంచి విముక్తిని కలిగించి, మానవుడికి జన్మరాహిత్యాన్ని కలిగిస్తుందని టీడీడీ, శ్రీశైలం దేవస్థానాల వ్యాఖ్యాత డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు పేర్కొన్నారు. బుధవారం నంద్యాల కోటవీధిలో వెలసిన రమసమేత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో మద్భాగవత మహాత్మ్యం గురించి ధార్మిక ప్రవచనం చేశారు. ఆలయ సిబ్బంది, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వసతి గదుల నిర్మాణం ప్రారంభం

మహానంది, ఫిబ్రవరి 14: మహానంది క్షేత్ర పరిసరాల్లో భక్తుల వసతి కల్పనలో భాగంగా దేవదాయశాఖ రూ.10 కోట్లతో నిర్మిస్తున్న 55 వసతి గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కాపు చంద్రశేఖరరెడ్డి, ఏఈవో ఎర్రమల్ల మధు, పర్యవేక్షకుడు వెంకటేశ్వర్లు, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, జడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, దేవస్థానం నిత్యాన్నదాన సత్రం కురగాయాల దాత లక్కబోయిన ప్రసాద్, ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు యాదవ్, నారాయణరెడ్డి, పాల్గొన్నారు.

యువకుడికి జైలు శిక్ష

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 14: నంద్యాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నడిగడ్డకు చెందిన జక్రియ అనే యువకుడికి 14రోజుల జైలు శిక్షను జడ్జి విధించినట్లు ట్రాఫిక్ సీఐ ఇస్మాయిల్ బుధవారం తెలిపారు. పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లో ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ చేస్తుండగా జక్రియాను పోలీసులు అడ్డుకున్నారు. కేసు నమోదు చేసి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రాంభూపాల్‌రెడ్డి ఎదుట హాజరు పరచగా 14రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

'పేదల కోసమే వైద్య శిబిరాలు'

ఆత్మకూరు, ఫిబ్రవరి 14: పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్న ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట పట్టణంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ తెలిపారు. బుధవారం 11వ సచివాలయం పరిధిలోని నవభారత్ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష -2 కార్యక్రమాన్ని పరిశీలించారు. వైద్యఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ వారు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. వైద్యాధికారులు రాయుడు, లక్ష్మీప్రసన్న, సాజిదాఫిర్దోస్, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

'హామీలు నెరవేర్చాలి'

ఆత్మకూరు, ఫిబ్రవరి 14: హామీలను నెరవేర్చాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షుడు రణధీర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు గొడుగు రాజు కోరారు. బుధవారం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు నాగన్న, రాజేంద్ర, జయన్న, సురేష్, రవి, దానమయ్య, రూతమ్మ, జీవరత్నమ్మ, మణెమ్మ, సుగుణమ్మ, కుమారీ తదితరులు ఉన్నారు.

ఆలిండియా షాట్‌పుట్ పోటీల్లో ప్రతిభ

పాణ్యం, ఫిబ్రవరి 14: ఆలిండియా షాట్‌పుట్ పోటీల్లో ఆర్జీఎం ఇంజనీరింగ్ విద్యార్థి ద్వితీయ స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఒంగోలులో జరిగిన అఖిల భారత స్థాయి ఇంజనీరింగ్ కళాశాలల స్పోర్ట్స్ ఫెస్ట్ 2024లో ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి భార్గవ నరసింహ ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ వెంకటేశ్, పీడీ వెంకటేశ్వరనాయక్, కోఆర్డినేటర్ మారుతిని అభినందించారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'



గోస్పాడులో మేనిఫెస్టో పత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

గోస్పాడు, ఫిబ్రవరి 14: రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమనిటీడీపీ నాయకులు పెద్ద హుసేని, పల్లె విశ్వనాథ్‌రెడ్డి, మనోజ్ అన్నారు. బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా బుధవారం గోస్పాడులో ఇంటింటికి వెళ్లి టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి గురించి, ఉపాధి అవకాశాల గురించి ప్రజలకు వివరించారు. తెలుగుదేశం పార్టీ నూతనంగా ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీల పత్రాలను ప్రజలకు ఇచ్చి వాటి గురించి వివరించారు. భవిష్యత్తు తెలుగుదేశం పార్టీదేనని, ప్రజలు మోసవద్దని సూచించారు. వైసీపీకి ఒక్క ఛాన్స్ అని అవకాశం ఇస్తే సీఎం జగన్ అన్ని వర్గాల ప్రజలను ముంచేశారని, ఆయనను ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 14: నంద్యాల మండలంలోని పులిమద్ది గ్రామంలో పోస్టల్ శాఖ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన పథకాలపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నమొత్తాల రూపంలో జమచేసుకుంటే రాబోయే కాలంలో జీవితానికి ఎంతో ఉపయోగ పడుతుందని నంద్యాల పోస్టల్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అధికారి సత్యనారాయణరావు పేర్కొన్నారు. పోస్టుమాస్టర్ అలిషా అధ్యక్షత నిర్వహించిన ఏఎస్‌పీ సత్యనారాయణరావు మాట్లాడుతూ.. చిన్నమొత్తాల పొదుపుతో ఎంతో లాభాదాకమైన మొత్తాన్ని పొందవచ్చునని అన్నారు. పోస్టల్ శాఖ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఎండీ నరసింహ, రామశేషిరెడ్డి, బీపీఎంలు, ఏబీపీఎంలు తదితరులు ఉన్నారు.

'మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి'

గడివేముల, ఫిబ్రవరి 14: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పొదుపు మహిళ సమాఖ్య కార్యాలయంలో బుధవారం ఆయన వైఎస్సార్ ఆసరా పథక నాల్గో విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 597 సంఘాలకు గాను నాల్గో విడతగా రూ.2.12 కోట్లు విడుదలయ్యాయని అన్నారు. జడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖర్‌రెడ్డి, డీఆర్ డీఈ పీడీ శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ గురునాథం, ఏపీఎం హజరత్, ఎంపీడీవో శివరామిరెడ్డి, ఆనంద్‌రెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

దుకాణంలో అగ్ని ప్రమాదం

శ్రీశైలం, ఫిబ్రవరి 14: శ్రీశైలం దేవస్థానం పరిధిలోని పాతాళగంగ రోడ్డు మార్గాన ఉన్న ఓ దుకాణంలో స్వల్ప అగ్ని ప్రమాదం జరిగింది. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో దేవస్థానం వాటర్ ట్యాంకర్ సమీపంలో ఉండడంతో మంటలను ఇతర దుకాణాలకు మంటలు వ్యాపించకుండా నియంత్రించారు. ఈ ప్రమాదంలో దాదాపు లక్ష విలువ గల వస్త్ర సామగ్రి కాలిపోయినట్లు బాధితులు తెలిపారు.

'నీటి ఎద్దడి నివారణకు చర్యలు'

ఆత్మకూరు, ఫిబ్రవరి 14: ఆత్మకూరు పట్టణంలో నీటి ఎద్దడి నివారణకై యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, కమిషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆత్మకూరు పట్టణంలో గత కొన్ని నీటి ఎద్దడి సంభవించి ఆయా కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాజగోపాల్, కోఆప్షన్ సభ్యులు ఎంఏ రషీద్ ఉన్నారు.

పనులు ఎలా చేపట్టాలి?

● నెలలు గడిచినా బిల్లులు రావడం లేదు
● మండల సమావేశంలో ఎంపీపీని ప్రశ్నించిన కార్యదర్శులు

పగిడ్యాల, ఫిబ్రవరి 14: సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంపీపీ మల్లీశ్వరి అన్నారు. దీంతో గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం సొంతగా ఖర్చు చేశామని, నెలలు కావస్తున్నా బిల్లులు అందకపోతే అభివృద్ధి పనులు ఎలా చేయాలని పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్రారెడ్డి, సమంత యశోదర, వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఆధ్వర్యంలో బుధవారం మండల సమావేశం నిర్వహించారు. 12 గంటలు కావస్తున్నా ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడంతో సిబ్బంది ఎంపీటీసీలకు ఫోన్లు చేసి సమావేశాన్ని హాజరు అయ్యేలా చూడటంతో తూతుమంత్రంగా సమావేశాన్ని నిర్వహించారు. అనతరం ఎంపీపీ సమావేశాన్ని హాజరు కాని ఎంపీటీసీలు, సర్పంచ్‌లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో చేతి పంపు బోర్లు మరమ్మతులకు నోచుకున్న కార్యదర్శులు, సర్పంచ్‌లు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆమె ప్రశ్నించారు. దీంతో బోర్లు రిపేర్ చేసేందుకు సియమించిన వ్యక్తికి పలుమార్లు ఫోన్‌లో సమాచారం ఇచ్చిన రావడం లేదని, బోర్లుకు మరమ్మతులు చేసే వ్యక్తి వచ్చి వాటిని పరిశీలించాకే అవసరమైన సామాగ్రిని కొనుగోళ్లు చేసేందుకు తీర్మానం చేస్తామని చెప్పారు. ఎంఈవో కార్యాలయం సమీపంలోని ఎంపీపీ పాఠశాలలో ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉందని, తొలగించాలని పలుమార్లు మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తెచ్చినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఎంఈవో సుభాన్ అన్నారు. విద్యార్థులకు ఏమైనా ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీవో కవిరాజ్, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, ఏవో జ్యోత్ కుమార్, కో-ఆప్షన్ మెంబరు అస్లాంబాషా, ఎంపీటీసీలు గోపాలు, స్వాములు, జయంతి, సర్పంచ్ శేషన్న, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వరుడికి పూజలు



పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

పాములపాడు/కొత్తపల్లి, ఫిబ్రవరి 14: పాములపాడు మండలంలోని ఇస్కాల గ్రామ శివార్లలోని నందీశ్వర ఆలయంలోని ఈశ్వరున్ని, కొత్తపల్లి మండలంలోని కొలనుభారతి క్షేత్రంలో సరస్వతీదేవిని, సప్తనదుల సంగమేశ్వరున్ని బుధవారం టీడీపీ నాయకులు దర్శించుకున్నారు. బుధవారం నందికొట్కూరు నియోజకవర్గ అధికార ప్రతినిధి కాకరవాడ చిన్న వెంకటస్వామి, నియోజకవర్గం ఎన్నికల సమన్వయకర్త మహేష్ నాయుడు, ప్రముఖులు చెరుకుచెర్ల రఘురామయ్య స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగు యువత మండల అధ్యక్షుడు మధుక్రిష్ణ, స్వామి, ఆరె చంద్రశేఖర్‌రావు, శివారెడ్డి, ముజూబూరు రెహమాన్, రాజన్న, మోహన్, ప్రవీణ్, ఉపేంద్ర, నాగశేషులు, పుల్లారెడ్డి, పుల్లన్న, రాముడు, వీరాపురం, పుల్లన్నశంకర్, సుధాకర్ పాల్గొన్నారు.

'ప్రభుత్వాసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు'



వైద్యులతో జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.ప్రసాదరావు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 14: నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వచ్చాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.ప్రసాదరావు తెలిపారు. బుధవారం నంద్యాలలోని జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఆస్పత్రి నుంచి సర్వజన వైద్యశాలగా నంద్యాల ఆస్పత్రి మారడంతో అవసరమైన సూపర్‌స్పెషాలిటీ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ఖాళీగా ఉన్న ఆయా విభాగాల్లోని పోస్టులను భర్తీ చేశామన్నారు. న్యూరో సర్జన్, న్యూరో ఫిజిషియన్, యూరాలజీ, నెఫ్రాలజీ విభాగాల వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని ఆయన చెప్పారు.

బుచ్చిరెడ్డి మృతికి ప్రముఖుల నివాళి

పాములపాడు, ఫిబ్రవరి 14: పాములపాడులో అనారోగ్యంతో నాయకుడు బుచ్చిరెడ్డి చెందారు. మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి నాయకుడి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. బైరెడ్డి వెంట నాగేశ్వరరావు, స్థానిక నాయకులు కురువ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య.. బుచ్చిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట టీడీపీ సీనియర్ నాయకులు హరినాథ్‌రెడ్డి, గోవింద్, సురేశ్, కరీం హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు కేంద్రాలపై నిర్ణయం: కలెక్టర్

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 14: వచ్చే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు కేంద్రాలపై నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఓట్ల లెక్కింపు కేంద్రాలు, ఓటర్ల జాబితా, స్ట్రాంగ్‌రూముల నిర్వహణ తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డీఆర్వో పద్మజ, కాంగ్రెస్ పార్టీ తరుపున సయ్యద్ రియాజ్ బాషా, టీడీపీ తరపున శివరామిరెడ్డి, బీజేపీ తరుపున అభిరుచి మధు, చంద్రశేఖర్ తదితరులు ప్రతినిధులుగా పాల్గొన్నారు. కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు మాట్లాడుతూ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ఆర్జీఎం కాలేజ్ ఓట్ల లెక్కింపు కేంద్ర నిర్వహణకు ఆక్షేపించడంతో రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్వీఆర్, శాంతిరాం ఇంజనీరింగ్ కాలేజిలలో ఓట్ల లెక్కింపు కేంద్రాలకు అనుకూలంగా ఉన్నాయని, వీటిపై ఆక్షేపణలు ఎదురైతే కర్నూలు జిల్లా రాయలసీమ యూనివర్సిటీ ఓట్ల లెక్కింపు కేంద్రాల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఓటర్ల జాబితాలో ఫారం 6,8 ద్వారా కొత్తగా నమోదు, సవరణలు చేపడుతున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అలాగే జాబితాలో తొలగింపునకు సంబంధించి నివేదికలు కలెక్టర్ కార్యాలయానికి సమర్పించాలని అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలకు ఆదేశాలు జారీ చేశామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఈఆర్వోలు, ఎన్నికల విభాగపు అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు శంకుస్థాపన

నంద్యాల (కల్చరల్): ఏపీలోని పలు పరిశ్రమలకు బుధవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ వర్చువల్ విధానంలో శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. సుమారు రూ.4,178 కోట్ల పెట్టుబడితో ఈ యూనిట్లు ఏర్పాటు అవుతున్నాయి. ముఖ్యంగా బిర్లా గ్రూప్, రిలయన్స్ ఎనర్జీ, హెల్లాఇన్‌ఫ్రా, వెసువియస్ ఇండియా లిమిటెడ్, ఏపీఐఐసీ, ఏపీ ఎంఎస్ఎంఈ కార్పొరేషన్‌లకు చెందిన పలు ప్రాజెక్టులకు వర్చువల్‌గా మంత్రి శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు, డీఆర్వో పద్మజ, పరిశ్రమల మేనేజర్ శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

గృహ నిర్మాణాన్ని వేగవంతం చేయాలి: పీడీ



చాగలమర్రిలో పక్కా గృహాలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ రామకృష్ణ

చాగలమర్రి, ఫిబ్రవరి 14: జిల్లాలో జగనన్న లేఔట్‌లో జరుగుతున్న పక్కా గృహాల పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ రామకృష్ణ సూచించారు. బుధవారం చాగలమర్రి గ్రామంలోని నారాయణపల్లె రహదారిలో ఉన్న జగనన్న లేఔట్‌లలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న గృహాలను ఆయన పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ 9,513 గృహాలు మంజూరు కాగా 5,177 గృహాలు పూర్తయ్యాయని, 2,468 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. చాగలమర్రి మండలంలో 2,303 గృహాలు మంజూరయ్యాయని, వాటిలో 723 గృహాలు పూర్తి చేశారని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. ఇంజనీరింగ్ సహాయకులు, హౌసింగ్ సిబ్బంది కలిసి గృహాలు నిర్మించుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని, నిర్మాణాలు చేపడితే బిల్లులు వస్తాయో, రావో అనే అపోహలు పెట్టుకోవద్దని, బిల్లుల చెల్లింపులో ఎలాంటి జాప్యం జరగదని అన్నారు. ఆయన వెంట హౌసింగ్ ఈఈ హరిగోపాల్, డీఈ నాగరాజు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఓబులేసు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

చాగలమర్రి, ఫిబ్రవరి 14: చాగలమర్రి గ్రామంలోని కస్తూర్బా పాఠశాల, నగల్లపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలను ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల బుధవారం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల గ్రేడింగ్‌ను, వర్క్‌బుక్కులను పరిశీలించారు. కస్తూర్బా పాఠశాలలో పది విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ఎంఈవో అనూరాధ సూచించారు. నగల్లపాడు ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో న్యామతుల్ల పరిశీలించి మెను ప్రకారం భోజనం తయారు చేయాలని, నాణ్యతగల భోజనం విద్యార్థులకు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కస్తూర్బా ప్రిన్సిపాల్ సునీత, హెచ్‌ఎం లలితకుమారి, సీఆర్పీ అమీర్‌ఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

చాగలమర్రి, ఫిబ్రవరి 14: మండలంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని డీటీ విజయ్‌కుమార్, వీఆర్వోలు హౌసింగ్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం సంత మార్కెట్ సచివాలయంలో జరుగుతున్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 2,800 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని, వారందరికీ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

'టీడీపీతోనే బీసీల సాధికారత'

చాగలమర్రి, ఫిబ్రవరి 14: టీడీపీతోనే బీసీల సాధికారత సాధ్యమని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్, సీమాంధ్ర బీసీ సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాషా అన్నారు. బుధవారం చాగలమర్రి బీసీ సంఘం కార్యాలయంలో వారు మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి టీడీపీ చేయూతనిచ్చిందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక బీసీ కార్పొరేషన్‌లను నిర్వీర్యం చేసిందన్నారు. ఆదరణ పనిముట్లను పంపిణీ చేసిన ఘనత టీడీపీకే దక్కిందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వీర జవానులకు అశ్రు నివాళి



రుద్రవరంలో జవాను వేషధారణలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

రుద్రవరం, ఫిబ్రవరి 14: రుద్రవరంలో జవానుల వేషధారణలో విద్యార్థులు బుధవారం అమరవీర జవాన్లకు సెల్యూట్ చేస్తూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా నంద్యాల డివిజన్ అపుస్మా అధ్యక్షుడు అమీర్‌బాషా ఆధ్వర్యంలో చైతన్య పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అమీర్‌బాషా మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 14న సాయంత్రం 4గంటల సమయంలో జమ్ముకశ్మీర్‌లోని పుల్వా జిల్లాలోని అవంతిపురం వద్ద భద్రతా దళాలపై ఉగ్రదాడిలో అసువులు బాసిన మన అమరవీర జవాన్లకు సెల్యుట్ చేస్తూ నివాళి అర్పించామని చెప్పారు. దేశ సేవలో జవానులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. నేడు బ్లాక్‌డే అని అన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జబ్బార్, హెచ్‌ఎం ప్రసాద్ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: కార్గిల్ యుద్ధంలో అమరులైన జవానులకు పట్టణంలో బుధవారం ఆయన ఘనంగా నివాళి అర్పించారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల అధ్యక్షుడు అమీర్‌బాషా మాట్లాడుతూ జవానులకు దేశానికి చేసిన సేవలు మరువరానివని కొనియాడారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

రుద్రవరం, ఫిబ్రవరి 14: రుద్రవరంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. గురువారం ఆలయ ఆవరణలో హోమాలు, అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొనాలని ఆలయ కమిటీ నిర్వాహకులు కోరారు.

సమ్మెను జయప్రదం చేయండి

బేతంచెర్ల, ఫిబ్రవరి 14: ఈ నెల 16న చేపట్టిన దేశవ్యాప్త రవాణా సమ్మెను జయప్రదం చేయాలని లారీ వర్కర్స్ యూనియన్ నాయకులు లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. డ్రైవర్లు ఈ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో లారీ ఓనర్స్ ఓనర్ కం డ్రైవర్స్, ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, సీపీఎం సీనియర్ నాయకులు సాధిక్ హుశేన్ , ఎల్‌ఐసీ నాగేంద్ర, పరమేశ్, నాగేశ్వర్ రెడ్డి, కొండారెడ్డి, మాబాషా, నరసింహారెడ్డి, రామ్మోహన్, మద్దయ్య, సభ్యులు పాల్గొన్నారు.

గూబగుండంలో ఉత్సవ పల్లకి

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 14: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పార్వేట పల్లకి గ్రామాల్లోని ప్రజలచే పూజలందుకుంటున్నది. ఆళ్లగడ్డ మండలంలోని గూబగుండంలో గ్రామంలో బుధవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

అభివృద్ధి గోరంత.. ప్రచారం కొండంత

జగన్‌ప్రభుత్వంపై భూమా అఖిలప్రియ ఆగ్రహం



యర్రగుంట్లలో పర్యటిస్తున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

శిరివెళ్ల, ఫిబ్రవరి 14: రాష్ట్రంలోని గ్రామాల్లో వైసీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి గోరంత ఐతే.. ప్రచారం మాత్రం కొండంత చేస్తున్నారని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆరోపించారు. మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో బుధవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మినీ మేనిఫెస్టో గురించి వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. అఖిలప్రియ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీల నిధులను అడ్డగోలుగా దారి మళ్లించి సర్పంచ్‌ల వ్యవస్థను ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. యువతకు ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని నమ్మించి గద్దెనెక్కిన వైసీపీ నిరుద్యోగులను నిలువునా మోసగించిందన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో అరకొర ఖాళీలతో డీఎస్సీ విడుదల చేయడం హేయనీయమన్నారు. వైసీపీ పరిపాలనతో విసిగిపోయిన ప్రజలు వచ్చే ఎన్నికల్లో టీడీపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళి, ఎంపీటీసీ-2 కమతం జయరామిరెడ్డి, మాజీ సర్పంచ్ కమతం పుల్లారెడ్డి, కమతం లక్ష్మీరెడ్డి, సత్తారు లక్ష్మీరెడ్డి, సుబ్బారెడ్డి, శీలం లక్ష్మీప్రసాద్, రామ్మోహన్, తాళ్లూరి బుగ్గన్న, మండ్ల హుసేనప్ప తదితరులు పాల్గొన్నారు.

పార్టీని గెలిపించుకుందాం

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 14: మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, విఖ్యాత్‌రెడ్డి టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును కలిశారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు వారు విజయవాడకు వెళ్లి ఆయనను కలిశారు. టీడీపీ గెలుపునకు కృషి చేస్తామని వారు చెప్పారు.

ఆళ్లగడ్డలో వైసీపీకి షాక్

- నేడు టీడీపీలోకి చింతకుంట శ్రీనివాసరెడ్డి



చంద్రబాబునాయుడును కలిసిన అఖిలప్రియ, విఖ్యాత్‌రెడ్డి

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 14: ఆళ్లగడ్డలో వైసీపీకి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన చింతకుంట శ్రీనివాసరెడ్డి(వాసు) విజయవాడలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సమక్షంలో గురువారం సాయంత్రం 4 గంటలకు పార్టీలో చేరనున్నారు. మాజీ మంత్రి అఖిలప్రియ, భార్గవ్‌రామ్‌నాయుడు, భూమా విఖ్యాత్‌రెడ్డి ఆధ్వర్యంలో చేరనున్నారు. ఆయన చేరికతో ఆళ్లగడ్డ పట్టణంతోపాటు ఆళ్లగడ్డ, దొర్నిపాడు, ఉయ్యాలవాడ, శిరివెళ్ల మండలాల్లో తీవ్ర ప్రభావం చూపనుంది. చింతకుంట శ్రీనివాసరెడ్డి తాత సీపీ తిమ్మారెడ్డి శిరివెళ్ల, ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రథమ ఎమ్మెల్యేగా పని చేశారు. శ్రీనివాసరెడ్డితోపాటు పలువురు ఆళ్లగడ్డ మున్సిపల్ కౌన్సిలర్లు టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు.

ఉద్యోగాలు కల్పిస్తాం



గోసానిపల్లె గ్రామంలో కరపత్రాలు పంచుతున్న ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్(రూరల్), ఫిబ్రవరి 14: టీడీపీ అధికారంలోకి రాగానే ఉద్యోగాలు కల్పిస్తామని డోన్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని గోసానిపల్లె, కొట్లవారిపల్లె గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేసి వివరించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు మూడు నెలలు ఉండగా.. మెగా డీఎస్సీ అంటూ నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని, ఇది మెగా డీఎస్సీ కాదని, దగా డీఎస్సీ అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించే బాధ్యత తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, టీడీపీ సలహాదారుల కమిటీ అధ్యక్షులు మురళీకృష్ణగౌడు, టీడీపీ పట్టణ అధ్యక్షులు సీఎం శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, బీసీసెల్ అధ్యక్షులు రామాంజనేయులు, మెట్టమద్దయ్య, సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాజశేఖర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఎల్‌ఐసీ శ్రీరాములు, కిట్టు, శ్యాంసుందర్ రెడ్డి, అడ్వకేట్ రాముడు, సురేష్, ధను, ప్రసాద్, శ్రీరాములు, రాజేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



బనగానపల్లెలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

బనగానపల్లె, ఫిబ్రవరి 14: ఉపాధ్యాయుల పెండింగ్ బకాయి బిల్లులను చెల్లించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ప్రతాప్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని కస్బా ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు సత్యప్రకాశ్ మాట్లాడుతూ జగన్ ఇచ్చిన హామీల ప్రకారం తక్షణమే సీపీఎస్‌ను రద్దు చేయాలని, ఓపీఎస్‌ను అమలు చేయాలని 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, జీతాలు, పెన్షన్లు ప్రతి నెలా 1వ తేదీనే చెల్లించాలని పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నీ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దస్తగిరి, కృష్ణయ్య, నాగరాజు, అబ్దుల్ కలీం, అబ్దుల్‌షరీఫ్, అబ్దుల్లా, పుష్పలత, సత్యనారాయణరెడ్డి, రంగన్న, కళావతి పాల్గొన్నారు.


కోవెలకుంట్ల: కోవెలకుంట్ల తహసీల్దారు కార్యాలయం ఎదుట ద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని జిల్లా ఏపీఎన్‌జీవో సంఘం అధ్యక్షుడు మునిస్వామి, కార్యదర్శి ప్రసాదరెడ్డి, ఇతర సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ తహసీల్దారు జయప్రకాశ్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులు, నరసింహులు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

డోన్(రూరల్): రాష్ట్ర ప్రభుత్వం పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం కార్యాచరణ సమితి (జేఏసీ) తాలుకా అధ్యక్ష కార్యదర్శులు షమివుల్లా, ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డోన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నుంచి ఆర్‌డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, ఎస్టీయు నాయకులు జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

'బకాయిలు చెల్లించాలి'

చాగలమర్రి, ఫిబ్రవరి 14: ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని వైద్య ఉద్యోగులు, వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి బుధవారం నిరసన ప్రకటించారు. చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో నియోజకవర్గ ఎన్‌జీవో కార్యదర్శి రామలింగారెడ్డి ఆధ్వర్యంలో వైద్య ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్య ఉద్యోగులు వెంకటమ్మ, రాజేష్, శేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రామాలయంలో ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ పూజలు



కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 14: మండలంలోని పెట్నికోట గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠ పూజలు బుధవారం ముగిశాయి. కార్యక్రమానికి జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాజీ జడ్పీటీసీ ఎర్రబోతుల ఉదయ భాస్కర్ రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు.

ఆర్ బుక్కాపురంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

బేతంచెర్ల, ఫిబ్రవరి 14: మండలంలోని ఆర్.బుక్కాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు బుధవారం నిర్వహించారు. డోన్ టీడీపీ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ ఎల్లనాగయ్య, పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, తిరుమలేష్ చౌదరి, టీడీపీ మండల బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్ష్మన్న, గ్రామ సర్పంచ్ నాగరాజు, ఆర్.కొత్తపల్లి టీడీపీ నాయకుడు మునీశ్వరరెడ్డి, వార్డు కౌన్సిలర్ రామాంజనేయులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా కంబగిరి స్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ



డోన్‌లో కంబగిరి స్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

డోన్(రూరల్), ఫిబ్రవరి 14: పట్టణంలోని కొత్తబస్టాండు ప్రధాన రోడ్డులో ప్రభుత్వ ఐటీఐ వద్ద ఉన్న ఎర్రమల కంబగిరి స్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. నవగ్రహాలు, గణపతి, అన్నపూర్ణేశ్వరి విగ్రహాల ప్రతిష్ఠాపన కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎర్రమల కంబగిరి స్వామి ఆలయ నిర్వాహకులు, సేవకులు, ఉపాసకులు, భక్తులు నల్లబోతుల నాగేంద్ర, నేరెడుచర్ల వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, అనిల్ కుమార్, గ్రెనేట్ పుల్లయ్య, జేసీబీ కంబగిరి, మల్కాపురం రామకృష్ణ, బోంచెర్వుపల్లె కిషోర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమి వేడుకలకు ఏర్పాట్లు

అవుకు ఫిబ్రవరి 14: మండలంలోని శివవరం గ్రామంలో వెలసిన సూర్యనారాయణ స్వామి ఆలయంలో 16న జరిగే రథసప్తమి వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు ఆలయ నిర్వాహకులు బుధవారం తెలిపారు, 15 వతేదీన రాత్రి 8 గంటలు నుంచి ఆలయంలో భజనలు, 16న సూర్యనారాయణ స్వామికి అభిషేకాలు, అర్చనలు గ్రామోత్సవం, రాత్రికి అన్నమాచార్య సంకీర్తనలు హరికథ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రెస్ క్లబ్‌కు స్థలం కేటాయించండి



డోన్ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏపీఎంఎఫ్ నాయకులు

డోన్(రూరల్), ఫిబ్రవరి 14: డోన్ పట్టణ కేంద్రంలో ప్రెస్ క్లబ్‌కు స్థలం కేటాయించి, ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఏపీఎంఎఫ్ తాలుకా అధ్యక్షులు నాగరాజు, జిల్లా సహాయ కార్యదర్శి జిలాని కోరారు. బుధవారం డోన్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అలాగే అక్రిడేషన్‌కు సంబంధం లేకుండా సంస్థ గుర్తింపు కలిగి ఉన్న గుర్తింపు కార్డుతో పని చేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించి న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏపీ మీడియా ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు హిట్లర్, కోశాధికారి ప్రవీణ్ కుమార్, సభ్యులు వలసల రంగస్వామి, సుధాకర్ ప్రసాద్ ఉన్నారు.

'మద్యం తాగి వాహనం నడపకూడదు'

రుద్రవరం, ఫిబ్రవరి 14: మద్యం తాగి వాహనాన్ని నడపకూడదని ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి సూచించారు. రుద్రవరంలో బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులకు సరైన పత్రాలు లేకపోవడంతో జరిమానా విధించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ రహదారి నియమాలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనంపై ముగ్గురు వెళ్లకూడదని ఆదేశించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. లైసెన్సు తప్పనిసరిగా ఉండాలన్నారు.

సమస్యలపై ఉద్యమ బాట : ఏపీ జేఏసీ

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 14: రాష్ట్రంలోని 13 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్ అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ బాట పడుతున్నట్లు ఏపీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరిరెడ్డి తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో తాలుకా కార్యదర్శి శివలింగారెడ్డి, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి, ఆర్టీసీ నాయకుడు శేఖర్, అధ్యాపకుల సంఘం నాయకుడు రాధాకృష్ణ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

శిరివెళ్ల, ఫిబ్రవరి 14: మండలంలోని గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ కులశేఖర్ అన్నారు. సాధారణ ఎన్నికల బదిలీల్లో భాగంగా శిరివెళ్ల తహసీల్దార్ షేక్ మోహద్దీన్ చిత్తూరు జిల్లాకు బదిలీ కాగా ఓ మహిళా ఉద్యోగిని అధికారులు నియమించారు. వ్యక్తిగత కారణాల వల్ల ఆమె విధుల్లో చేరకపోవడంతో చిత్తూరు జిల్లా నుంచి కులశేఖర్‌ను అధికారులు నియమించడంతో శిరివెళ్ల తహసీల్దార్‌గా ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆర్‌ఐ సుచరిత, మండలంలోని వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

చాగలమర్రిలో వైద్య శిబిరం

చాగలమర్రి, ఫిబ్రవరి 14: చాగలమర్రి గ్రామంలోని టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా టోల్‌ప్లాజా ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని టోల్ ప్లాజా హెడ్ మదన్‌మోహన్, ప్రాజెక్టు మేనేజర్ అరుణ్‌రాజ్, టోల్ ప్లాజా మేనేజర్లు పరదీప్ మాలిక్, యాకోబ్ ప్రారంభించారు. కర్నూలు అమీలియో వైద్యశాలకు చెందిన వైద్యులు రుక్సాన, అబ్దుల్ సమ్మద్ ప్రయాణికులు, వాహనదారులకు కంటి పరీక్షలు, గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టోల్ ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్య అడుగు జాడల్లో నడవాలి



దామోదరం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

బేతంచెర్ల, ఫిబ్రవరి 14: తొలి దళిత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అడుగు జాడల్లో నడవాలని రాష్ట్ర క్రిస్టియన్ సెల్ కార్యదర్శి మేకల నాగరాజు, టీడీపీ అధికార ప్రతినిధి రూబెన్ సూచించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాముడు, డోన్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు అంజి, వార్డు కౌన్సిలర్లు రామగోపాల్, నంద్యాల మధు, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గూటం శివ, మాధవ్, శ్రీపతి నాగరాజు, కానాల అంజి పాల్గొన్నారు.

ఉత్తమ డ్రైవర్లకు సత్కారం



డ్రైవర్‌ను సత్కరిస్తున్న నంద్యాల డిపో అధికారులు

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 14: కోవెలకుంట్ల ఆర్టీసీ డిపోలో పనిచేస్తూ ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రయాణికులకు గమ్యస్థానాలకు చేర్చిన కోవెలకుంట్ల డిపోకు చెందిన చిన్నన్న, కెవి పీ.రెడ్డి, టీబీ మద్దిలేటిలను బుధవారం నంద్యాల ఆర్టీసీ డిపో గ్యారెజ్‌లో బుధవారం ఘనంగా సత్కరించి పారితోషికం అందించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా కోవెలకుంట్ల డిపోకు చెందిన డ్రైవర్లుగా ఎంపిక చేసి నగదు బహుమతులు పంపిణీ చేశారు.



చాగలమర్రి ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈవో అనూరాధ



బేతంచెర్లలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు



వెంకటాపురంలో సరస్వతి దేవికి పూజలు చేస్తున్న ప్రజలు



ప్యాపిలిలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

వైభవంగా వసంతం పంచమి

చాగలమర్రి, ఫిబ్రవరి 14: చాగలమర్రి గ్రామంలోని బాలుర ఉన్నత పాఠశాల, మల్లేవేముల రహదారిలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం వసంత పంచమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. అనంతరం ఎంఈవో అనూరాధ చిన్నారులతో అక్షరాలు రాయించి సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని చేపట్టారు. బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కోటయ్య ఆధ్వర్యంలో సరస్వతి దేవి విగ్రహానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పూజలు చేశారు. శివరామానంద ఆశ్రమం పీఠాధిపతి అభినవ శంకరానందస్వామి, పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు పోలిశెట్టి, విశ్రాంత హెచ్‌ఎం మధుసూదన్‌శర్మ, ఆర్యవైశ్య సభ్యులు చెంచు సుబ్బారావు, సత్యనారాయణ, రాజేష్, నాగేంద్రకుమార్, సుబ్బారావు, హెచ్‌ఎం ప్రసాద్ కాంతారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బనగానపల్లె: మండంలోని వెంకటాపురంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల యందు వసంత పంచమి వేడుకలు బుధవారం సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో సరస్వతిదేవి మందిరం దాతల సహకారంతో ఏర్పాటు చేశారు. పారిశ్రామికవేత్త నాగిరెడ్డి సరస్వతి విగ్రహాన్ని సొంత నిధులతో సమకూర్చారు. శ్రీసరస్వతి మందిరానికి కటాంజనాన్ని సుభద్రమ్మ సమకూర్చారు. కార్యక్రమంలో సర్పంచ్ హరిత, శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఎం. మోహన్‌రెడ్డి, రాజశేఖర్, గ్రామ పెద్దలు, ప్రజలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంజామల: మన సంస్కృతి మరో తరానికి ఆదర్శం కావాలని కానాల జిల్లా పరిషత్ ప్రధాన ఉపాధ్యాయురాలు అరుణ కుమారి అన్నారు, బుధవారం స్థానిక పాఠశాలలో వసంత పంచమి వేడుకలను నిర్వహించారు. తలిదండ్రులు ఉపాధ్యాయులు సరస్వతిదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు వెంకట రమణ, శంకరయ్య ,ఓబులేసు, డీప్లా నాయక్ నాగార్జున చిన్న మౌలాలి గాంధీ బాబు, గ్రామ పెద్దలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

బేతంచెర్ల: బేతంచెర్లలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం సరస్వతిదేవి జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని సరస్వతి ఉన్నత పాఠశాలలో 75 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం తల్లిదండ్రులు చేయించారు. సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గణపతి స్తోత్రం, హోమాలు, విశేష పూజలు వేద పండితులు జ్వాలా చక్రవర్తి నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు గుండా గోపాల్, మద్దిలేటి స్వామి, లక్ష్మీ నారాయణ, ప్రధానాచార్యుడు బాల వెంకటరమణ, ఆచార్య బృందం, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలోని సరస్వతి శిశుమందిరంలో బుధవారం వసంత పంచమి వేడులను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతిదేవి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాదాపు 50మంది చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు.